ప్రజాశక్తి

మంగళవారం 16 ఏప్రిల్ 2024

I

అల్లూరి సీతారామరాజు

పర్యాటకులు లేక వెలవెల

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో అరకు పర్యాటక ప్రాంతం వెల వెల బోతోంది. మండలంలోని పర్యాటక కేంద్రాలైన చాపరాయి జలపాతంతో పాటు అటవీ శాఖ ఆధ్వర్యంలో అంజోడ సిల్క్ ఫారంలో ఏర్పాటు చేసిన అరకు పినారి బోసి పోయింది. పర్యాటకుల సందర్శన లేక ఇక్కడ చిరు వ్యాపారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న అరకు పినేరి

మన్యంలో మండుతున్న ఎండలు

ఉక్కిరిబిక్కిరవుతున్న గిరిజనం ▸▸ నిర్మానుష్యంగా ప్రధాన రోడ్లు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లాలో ఎండలు దంచి కొడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు చుర్రుమంటున్నాడు. సోమవారం ఎండకు తోడు వడ గాడ్పులు వీయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఇప్పుడే ఎండలు ఇంత తీవ్రంగా ఉంటే రానున్న మే, జూన్ నెలల్లో ఎంకెంత దారుణంగా ఉంటాయోనని జనం అందోళన చెందుతున్నారు. చింతూరులో సోమవారం అత్యదిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం వేళ వివిధ పనుల నిమిత్తం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణానికి వచ్చిన వారంతా వెంటనే ముగించు కొని ఇంటిదారి పట్టారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే పట్టణ పరిధిలోని ప్రధాన రహదారులు జనం లేక బోసి పోయింది. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు పుచ్చకాయ, చెరుకు, లస్సీ, పండ్ల రసాలు, ఐస్క్రీమ్, తదితర శీతల పానీయాలను సేవించారు.

సోమవారం అత్యధికంగా చింతూరులో 43.1, దేవీపట్నంలో 40.1, కూనవరంలో 42.3, గంగవరంలో 41.6, అడ్డతీగల 39.2, అనంతగిరి 35.4, అరకు వ్యాలీ 37.1, నెల్లిపాక 40.8, చింతపల్లి 37.1, డుంబ్రిగూడ 36,5, జీకే వీధి 38.8, జి మాడుగుల 37.5, హుకుంపేట 34.0, కొయ్యూరు 40.6, మారేడుమిల్లి 41.1, ముంచంగిపుట్టు 36.6, పాడేరు 37.5, పెదబయలు 36.6, రాజవొమ్మంగి 40.1 రంపచోడవరం 40.1 విఆర్ పురం 38.8 వై రామవరం 38.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు తీవ్రంగా ఉండటంతో బయటవకు వచ్చే వారు గొడుగులను ఆశ్రయిస్తున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న పాడేరు - అరకు రహదారి

గొడుగుల నీడన వెళుతున్న ఎఎన్ఎం శిక్షణా విద్యార్థులు

ఇవిఎంలు, వివి.ప్యాడ్లను భద్రపరుస్తున్న అధికారులు

స్ట్రాంగ్ రూమ్‌లో అరకు పార్లమెంట్ ఇవిఎంలు

ప్రజాశక్తి-రంపచోడవరం

త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలకు రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని అరకు పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎంలు, వివి ప్యాడ్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చినట్లు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్. ప్రశాంత్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రం పాడేరు నుంచి రెండు కంటైనర్లలో ఈవీఎంలు, వివి ప్యాడ్లు సోమవారం రంపచోడవరం తీసుకురాగా, రంపచోడవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్, రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ ఓపెన్ చేసి స్థానిక గిరిజన సంక్షేమ బాలురు వసతి గృహంలోని స్ట్రాంగ్ రూమ్‌లో స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అరకు పార్లమెంటుకు సంబంధించి 11 మండలాలలో 399 పోలింగ్ కేంద్రాలకు గాను 518 ఈవీఎంలు, 518 వివి ప్యాడ్లు, 518 బ్యాలెట్ యూనిట్, 518 కంట్రోల్ యూనిట్లు వచ్చినట్లు చెప్పారు. ఈవీఎంల, వివి ప్యాడ్ల స్ట్రాంగ్ రూమ్ పరిధిలో ఇతరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదని స్పష్టం చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూములో భద్రపరిచి సీల్ వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి, డిప్యూటీ తహశీల్దార్లు ఎన్‌వివి సత్యనారాయణ, బి.రాజు, చైతన్య, శ్రీధర్, విశ్వనాథం, శివ, సిఐ వి.వెంకటేశ్వరరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.శ్రీనివాసరావు, కె.బాలకృష్ణ, చుక్క.సంతోష్ కుమార్, కృష్ణారెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు టి.లక్ష్మణరావు, ఇందిరా బాయ్, పాలు బాబు, వీఆర్వోలు, గణపతి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 విజయమే లక్ష్యంగా చదవాలి

ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: విజయమే లక్ష్యంగా గ్రూప్ 2 మెయిన్స్ పై అభ్యర్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐటిడిఏ పిఒ వి. అభిషేక్ సూచించారు. గ్రూప్ 2లో ప్రిలిమ్స్ లో విజయ సాధించి మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులను ఆయన అభినందించారు. వేపగుంట వైటీసిలో ఐటిడిఏ ఆధ్వర్యంలో 21వ సెంచరీ ఎడ్యుకేషన్ సొసైటీ అందిస్తున్న సివిల్స్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, అభ్యర్థులు బాగా సాధన చేసి ప్రభుత్వ కొలువులు సాధించాలని చెప్పారు. గ్రూపు -2లో విజయం సాధిస్తే గ్రూప్-1 పై నమ్మకం పెరుగుతుందని ఆయన అన్నారు. మీరందరూ ఎపీపిఎస్సీ నిర్వహిస్తున్న పోటీ పరీక్షలలో విజయం సాధిస్తే గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. 11 మండలాల గిరిజన అభ్యర్థులకు నమ్మకం పెరిగే విధంగా పోటీ పరీక్షలలో విజయం సాధించాలని సూచించారు. పాడేరు డివిజన్ ఐటిడిఏ పరిధిలో ఉన్న 117 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఆదర్శంగా మీ ఫోటోలను చూపిస్తామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను ఆదర్శంగా తీసుకుని సివిల్స్‌లో విజయం సాధించాలని సూచించారు. ఆయన సివిల్స్ సాధించడంతో రాజస్థాన్ లోని మూడు జిల్లాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. అనంతరం పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు జాగ్రఫీ పాఠ్యాంశాలను బోధించారు. ఎకనామిక్ సర్వే ఆఫ్ ఎపిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంతవరకు సిలబస్ పూర్తి చేసిన పాఠ్యాంశాలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఏ సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అభ్యర్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రూప్- 2 మెయిన్స్ పై వారాంతపు పరీక్షలు నిర్వహించాలని పిఓ అభిషేక్ సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎల్.రజని, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్నప పిఒ అభిషేక్

ఎండలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఎండ వేడికి ఉపాధి కూలీలు విలవిల

ప్రజాశక్తి-విఆర్.పురం

ఎండలు మండుతుండడంతో మండలంలో ఉపాధి హామీ పనులు చేసే కూలీలు విలవిలలాడుతున్నారు. ఉదయం 8 గంటల నుండే భానుడు భగభగ మండుతుండడంతో ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు. పని ప్రదేశాల్లో నీడ, మంచినీరు ఏర్పాట్లు చేయకపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు. మండే వేసవిలో ఎండ వేడి అధికంగా ఉన్న దృష్ట్యా పని పని గంటలు కుదించాలని, రోజువారి వేతనంతో పాటు అదనంగా వేసవి అలవెన్సులు ఇవ్వాలని కూలీలు కోరుతున్నారు. రోజువారి వేతనంతో పాటు దానికి సమానంగా వేసవి అలవెన్సలు విధిగా ఇవ్వాలని, పనిముట్లకు అదనపు అలవెన్సలు ఇవ్వాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ప్రవేశాలలో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉంటారని, తాగునీరు, మజ్జిగ సౌకర్యం కల్పించాలని కోరింది.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చింతూరు ఐటిడిఎ పిఒ చైతన్య

సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి-చింతూరు

సార్వత్రిక ఎన్నికల్లో విధుల నిర్వహణపై ఉపాధ్యాయులు, ఎపిఒలకు సోమవారం చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కావూరి చైతన్య ఆధ్వర్యంలో సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. చింతూరు, విఆర్ పురం, కూనవరం, ఎటపాక తదితర 4 మండలాలకు సంబంధించిన ఉపాధ్యాయులకు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతూరు తహశీల్దార్ నజీముల్లాషా, ఏపీవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ ఆఫీసర్ ఆధ్వర్యాన అగ్ని ప్రమాదాల నివారణపై రంపచోడవరంలోని మెయిన్ రోడ్, అంబేద్కర్ సెంటర్, బస్ కాంప్లెక్స్ సెంటర్ తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన, వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. గ్యాస్ ఫైర్ గురించి ప్రయోగాత్మకంగా చేసి ప్రజలతో చేయించారు. అనంతరం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపకశాఖ అధికారులు లక్ష్మణస్వామి, గంగన్నదొర, రామచంద్ర రావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ప్రమాదంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేస్తున్న ఫైర్ సిబ్బంది

స్ప్రేయింగ్ పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్

1,767 గ్రామాల్లో తొలి విడత స్ప్రేయింగ్

-జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు:మలేరియా ప్రభావిత గ్రామాలలో ముందస్తుగా దోమల మందు పిచికారీ చేపడతామని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. సోమవారం చింతలవీధి పంచాయతీ ఉబ్బేటిపుట్టు గ్రామంలో దోమల మందు పిచికారీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రణాళిక ప్రకారం నిర్దేశించిన గ్రామాలలో ఎసిఎం మందు పిచికారీ పనులు పూర్తి చేయాలని మలేరియా అధికారులను సిబ్బందిని ఆదేశించారు. వైద్యాధికారులు, క్షేత్ర స్థాయి వైద్య, మలేరియా సిబ్బంది సమన్వయంతో పని చేసి విజయ వంతంగా పిచికారీ పనులు పూర్తి చేయాలని సూచించారు. మొదటి విడత స్ప్రేయింగ్ కార్యాచరణ ప్రకారం ఈనెల 30వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 307 సచివాలయాల పరిధిలోని 1767 గ్రామాలలో దోమల మందు (ఎసి యం 5 శాతం)ను పిచికారీ చేయడానికి లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. పిచికారీ పనులను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని మలేరియా సిబ్బందిని ఆదేశించారు. దోమల మందు పిచికారీకి గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి టి. ఎస్. ఎస్. ప్రసాద్, డిఐ ఓ.సాధన, సబ్ యూనిట్ అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన వాలంటీర్లు సామూహికంగా రాజీనామాలు సమర్పిస్తున్నామని వాలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు వేములపూడి పరమేశ్వరరావు తెలిపారు. ఆయా పంచాయతీల కార్యదర్శులకు, ఎంపీడీవో వీర సాయిబాబాకు మూకుమ్మడిగా రాజీనామాలు సమర్పించారు. ఈ సందర్భంగా పరమేశ్వర రావు మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరలా సిఎంగా గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. సుమారు 190 మందికి పైగా వాలంటీర్లు సామూహికంగా రాజీనామాలు సమర్పించారని తెలిపారు.ఎన్నికల నియమావళిని అనుసరించి తమ సేవలను ప్రజలకు అందించకుండా ప్రతిపక్షాలు కుట్ర చేశాయని విమర్శించారు. పాడేరు, అరకు వైసిపి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగన్మోహన్ రెడ్డికి బహుమతిగా ఇస్తామన్నారు.

రాజీనామా లేఖలు చూపుతున్న వాలంటీర్లు

ఇండియా ఫోరం బలపర్చిన

సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలి

గిరిజనులతో సమావేశమైన సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-సీలేరు

ఇండియా ఫోరం బలబర్చిన అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జీకే వీధి మండలం గుమ్మరేవులు, దుప్పులవాడ పంచాయతీల్లో ఇండియా ఫోరం పార్టీలైన సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. చిన్న గంగవరం, పెద్ద గంగవరం, పెట్రాయి, నిమ్మచెట్టు అగ్రహారం తదితర గ్రామాలను సందర్శించి గిరిజనులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ గిరిజనుల చట్టాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పోడుస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నాయని, వాటిపై పోరాటం చేయాలంటే చట్ట సభల్లో ఆదివాసీల వాణిని విరిపించగలిగే దమ్మున్న సిపిఎం అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జీకే వీధి మండల కమిటీ సభ్యులు బాకూరు కోటేశ్వరరావు, సిపిఐ మండల కమిటీ సభ్యులు భగవాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు సంకర విష్ణుమూర్తి, కాంగ్రెస్ జిల్లా నాయకులు లక్కీ వెంకటరమణ, గుమ్మరేవుల మాజీ సర్పంచ్ పూజారి బాబురావు, దుప్పిలివాడ మాజీ సర్పంచ్ అల్లంకి రాజు, కాంగ్రెస్ నాయకులు మల్లు దొర, సొన్ను రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమగ్రాభివృద్ధికి సిపిఎంను గెలిపించాలి

చింతూరు : ఏజెన్సీ ప్రాంత సమగ్రాభివృద్ధి సాధించాలన్నా, ఆదివాసీలు అభివృద్ధి చెందాలన్నా రానున్న ఎన్నికల్లో రంపచోడవరం అసెంబ్లీ, అరకు పార్లమెంట్ నియోజకవర్గాల నుండి సిపిఎం అభ్యర్థులను తెలిపించాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ పిలుపునిచ్చారు. సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలోని ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధి బలిమెర, చుక్కలపాడు, చిన్న ఏడుగురాళ్లపల్లి గ్రామాలలో సోమవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో సురేష్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో భద్రాచలం నియోజకవర్గం నుండి ఎన్నికైన సిపిఎం ప్రజాప్రతినిధులు విలీన నాలుగు మండలాల్లోని అనేక గ్రామాల్లో కల్పించిన తాగు, సాగునీరు, విద్య, వైద్యం, రహదారులు వంటి మౌలిక సౌకర్యాలు నేటికీ అనేకం మన ముందు కనిపిస్తున్నాయని చెప్పారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసీ వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని, దానికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు వత్తాసు పలికి, ఆదివాసీలకు తీరని అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. ఆదివాసీలను కాపాడాలంటే ఎర్రజెండా పార్టీలకు మద్దతు తెలియజేయాలని, రంపచోడవరం అసెంబ్లీ సిపిఎం అభ్యర్థి లోత రామారావు, అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మల్లం సుబ్బమ్మ, ముట్టం రాజయ్య, సవలము కన్నయ్య, దిలీప్ జానీ, మాసయ్య, రవ్వ జోగయ్య, ఎడమయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్

వ్యాన్ బోల్తా ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -సీలేరు

సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న అశోక్ లైలాండ్ వ్యాన్ ఈ నెల 13న జికె.వీధి మండలం ఆకులూరు గ్రామ సమీపంలోని ఘాట్ రోడ్డులో అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి సోమవారం మృతి చెందినట్లు సీలేరు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ వెల్లడించిన వివరాలు ప్రకారం... జీకే వీధి మండలం సప్పర్ల నుండి సిమెంట్ లోడ్‌తో అశోక్ లైలాండ్ వ్యాను వెళ్తూ ఆకులూరి గ్రామ సమీప ఘాట్ రోడ్లో ఈ నెల 13న అదుపుతప్పి పది అడుగుల లోయలోకి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ గంగుల నాయుడు, ఈ వ్యాన్ వెనుక భాగం తొట్టిలో ఉన్న పనసలబంధ గ్రామానికి చెందిన పాంగి సన్యాసిరావు, వంతల రమేష్, పాంగి బాబి, వంతల రవికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వంతల సన్యాసిరావు పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం 9.30 గంటలకు మృతి చెందారు. దీనిపై సీలేరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

మాట్లాడుతున్న ఎఎస్‌పి

గోదాము యజమాని అరెస్టు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: సార్వత్రిక ఎన్నికల వేళ ఓ గోదాములో దాచి పెట్టిన మద్యం సీసాలను స్థానిక పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లా ఎఎస్పీ ధీరజ్ సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని జోలాపుట్ పంచాయతీ కేంద్రంలో వారణాసి మాణికేశ్వరరావుకు చెందిన గోదాములో ఈ నెల 6న జి.మాడుగుల సిఐ రమేష్, ఎస్ఐ కె.రవీంద్ర తనిఖీలు చేసి 5,424 మద్యం బాటిల్స్ గుర్తించారని తెలిపారు. గోదాములో అక్రమంగా నిలువ ఉంచిన యజమాని ఎ1 వారణాసి మాణికేశవరావును అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించామన్నారు. ఎ2 నిందితుడు వారణాసి జగదీష్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, త్వరలో నిందితుడిని అదుపులోకి తీసుకొంటామని ఎఎస్పీ తెలిపారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న గంగాధర స్వామి

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

ప్రజాశక్తి- అరకులోయ: మండలంలోని మాడగడ పంచాయతీ పకనగుడలో ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌తో సహా 100 మంది గిరిజనులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామి పార్టీ కండు వాలను వేశారు. కాంగ్రెస్ పార్టీ అమలు పరుస్తునన పథకాలను ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు పలువురు తెలిపారు.కాంగ్రెస్ పార్టీతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని గిరిజనులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాకా బాబురావు, అప్పారావు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో వరల్డ్ ఆర్ట్ డే నిర్వహణ

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ప్రపంచ చిత్రకళ దినోత్సవం(వరల్డ్ ఆర్ట్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైవిధ్యమైన కళారూపాలను పరిచయం చేస్తూ నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ మిల్లెట్స్‌తో తీర్చిదిద్దిన కళారూపాలతో ప్రత్యేక ప్రదర్శన శివాజిపాలెంలోని ఏయూ చిత్రకళా విభాగంలో ఏర్పాటు చేశారు. దీనిని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు ప్రారంభించి, తిలకరించారు. అనంతరం చిత్రకారుడు విజయ్ కుమార్ కృషిని అభినందించారు. ఆరోగ్యాన్ని అందించే మిల్లెట్స్ ప్రాధాన్యతను దేశవ్యాప్తంగా చాటుతూ గత ఏడాది కాలంగా చేస్తున్న విశేష కృషిని ప్రశంసించారు. కళకు కాదేదీ అనర్హం అన్న చందంగా మిల్లెట్స్‌ని మాధ్యమంగా వినియోగించి, ఎటువంటి రంగులు ఉపయోగించుకుండా కళాఖండాలను తీర్చిదిద్దిన విధానం విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. వరల్డ్ ఆర్ట్ డేని వైవిధ్యంగా విద్యార్థులకు నూతన జ్ఞానాన్ని అందించే విధంగా నిర్వహించిన విభాగాధిపతి సింహాచలాన్ని అభినందించారు. అనంతరం విభాగం తరపున మిల్లెట్ ఆర్టిస్ట్ విజయ్ కుమార్‌ను సత్కరించారు.

మూగజీవాలకు వ్యాధులు ప్రబలకుండా చర్యలు

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహులు

ప్రజాశక్తి- చింతపల్లి : మూగజీవాలకు వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు వేస్తూ తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని అల్లూరి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సీహెచ్ నర్సింహులు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం అల్లూరి జిల్లాకు సంబంధించి పశుసంవర్ధకశాఖ ప్రత్యేక సదస్సు నిర్వహించారు. స్థానిక పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు పాడేరు, రంపచోడవరం, అరకు డివిజన్ల పరిధిలోని పశువైద్యాధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నర్సింహులు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, పందులు, కోళ్లలో కాలానుగుణంగా పలురకాల వ్యాధులు ప్రభలే అవకాశం ఉందన్నారు. మనుషుల మధ్య సంచరించే ఈ మూగజీవాలతో మనుషులకూ అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఆంత్రాక్స్, బర్డ్, ఫ్లూ , స్వైన్ ఫ్లూ వంటివి ఈ విధంగా వస్తాయన్నారు. పశువుల నుంచి ఈ వ్యాధులు రాకుండా జిల్లా వ్యాప్తంగా వాక్సినేషన్ జరుగుతుందన్నారు. తాజాగా పందులకు వ్యాక్సిన్ వేస్తున్నామని తెలిపారు. పశుబీమా అమల్లో అల్లూరి జిల్లా మొదటి స్థానంలో నిలచిందన్నారు. ఇటీవల కాలంలో సుమారు 3244 మంది లబ్దిదారులకు పశుబీమా. అందించామన్నారు. వ్యవసాయానుబంధ పరిశ్రమగా పశువుల సంతతిని పెంచడంతో స్వయం ఉపాధి అవకాశాలు మెరగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు షేక్ అహ్మద్ షరీఫ్, ఏడీ చంద్ర శేఖరరావు, పశు వైద్యాధికారులు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరసింహులు

విద్యుత్ పునరుద్ధరించాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-అనంతగిరి: అనంతగిరి, హుకుంపేట మండల సరిహద్దు టివిటిజి పట్కదౌడా, డెకపురం గ్రామాలకు విద్యుత్తును తక్షణమే పునరుద్ధరించాలని పివిటిజి గిరిజనులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కిల్లో ఆనంద్, బాస్కరరావులు మాట్లాడుతూ, అరుకు మండలం సుంకరమెట పంచాయతీ సంగంవలస గ్రామం నుండి విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారని, గత రెండు వారాల నుండి విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో తామంతా అంధకారంలో మగ్గుతున్నామని తెలిపారు. రాత్రి సమయంలో అటవీ విషపూరితమైన జంతువులు తమ గ్రామంలో సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయంపై అనంతగిరి, హుకుంపేట విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని వాపోయారు. తక్షణమే విద్యుత్ పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గిరిజన గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు

దొన్నుదొర గెలుపునకు కృషి

ప్రజాశక్తి-హుకుంపేట: ఇండిపెండెంట్ అభ్యర్థి దొన్నుదొర గెలుపునకు కృషి చేస్తామని మండల కమిటీ టిడిపి శ్రేణులు తెలిపాయి. సోమవారం మండల కేంద్రంలోని సమావేశం ఏర్పాటు చేసి తీర్మానించారు. అనంతరం మీడియా సమావేశంలో నాయకులు బాలన్న,. శతక బొంజూబాబు, శంకర్ నాయుడు మాట్లాడుతూ, దొన్నుదొరకు టికెట్ విషయంలో లక్షల మంది ఉన్న సభలో సీటు ఖరారు చేస్తూ ప్రకటించి మాట వెనక్కి తీసుకోవడం బాధాకరమన్నారు. తమకు జరిగిన అన్యాయంపై నాలుగు గోడల మధ్యలో కుంగి పోకుండా ప్రజల వద్దకు వెళతామన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలుపొంది దొన్ను దొర సత్తా ఏంటో చూపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సోమేలి లక్ష్మయ్య, శ్యామ్, నాగేశ్వరరావు, ఈశ్వరరావు, జన్ని వెంకట్, సుబ్బారావు, పండన్న, మత్యరాజు, పండు, నర్సింగరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నేతలు

ఐఎస్‌టిడి వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ విశాఖ చాప్టర్ ఆధ్వర్యంలో ఐఎస్‌టిడి 54వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయం టిఎల్ఎన్ సభామందిరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి పాల్గొని సంస్థ ప్రగతిని ప్రభావితం చేసే అంశాలు, నూతన విధానాలు తదితర అంశాలను వివరించారు. సంస్థ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. జాతీయ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎన్.సాంబశివరావు మాట్లాడుతూ హెచ్ఆర్ నిపుణులకు గొప్ప వేదికగా ఇది నిలుస్తోందన్నారు. విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ డాక్టర్ ఒఆర్ఎం.రావు నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ కార్యదర్శి డాక్టర్ హేమ యడవల్లి, ప్రత్యేక అతిధి ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్(ఫైనాన్స్) ఎస్ఆర్‌విజికె గణేష్ నిపుణులను తీర్చిదిద్దడానికి ఇటువంటి సంస్థలు దోహదపడే విధానం వివరించారు. కార్యక్రమంలో ఐఎస్‌టిడి చాప్టర్ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రూ.2.18 లక్షలు పట్టివేత

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక గోస్తనీ చెక్ పోస్ట్ వద్ద తనిఖీల్లో భాగంగా సోమవారం ఎస్ఎస్‌టి బృందం సభ్యులు జివిఎంసి ఒకటో జోన్ యుసిడి, ఎపిడి వైసంతోష్‌కుమార్, మహిళా పోలీసు కానిస్టేబుల్ గౌరీశ్వరమ్మ తనిఖీ చేశారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో సింగన బంద ఓ క్రిడ్జి స్కూల్‌కు చెందిన కారు విశాఖ వైపు వస్తుండగా ఎస్ఎస్‌టి బృందం సభ్యులు కారులో తనిఖీ చేపట్టారు. కారులో స్కూల్ అకౌంటెంట్ వద్ద రూ.2లక్షలా 18 వేల 791 పట్టుబడ్డాయని పోలీసులు తెలిపారు. ఈ సమాచారాన్ని ఇఎస్ఎంఎస్ యాప్ ద్వారా పంపించామని పోలీసులు చెప్పారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాన్వెంట్ జంక్షన్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మృతుడు జి.అనిల్ కుమార్ (38) డాక్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో పనిచేస్తుంటాడు. స్వగ్రామం పెందుర్తికి వెళ్లే క్రమంలో కాన్వెంట్ జంక్షన్‌లో రోడ్డు దాటుతుండగా లారీ అతన్ని ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హార్బర్ సిఐ దశరథ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని టెక్కలిపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక సీఐ పిన్నింటి రమణ తెలిపారు. టెక్కలిపాలెం గ్రామానికి చెందిన కె. దేముడుబాబు తన ఇంటి ముందు మద్యం విక్రయిస్తుండగా దాడి పట్టుకున్నట్లు చెప్పారు. దేముడుబాబు వద్ద నుండి 138 (180 మిల్లీలీటర్లు) క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వాటి విలువ రూ.21,150 ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నాటుసారా శిబిరంపై దాడి

ప్రజాక్తి-గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెం పంచాయతీ జమ్మాదేవిపేట గ్రామ శివారులో సారా తయారీ స్థావరంపై సోమవారం దాడి చేసినట్లు ఎస్సై బీ.కృష్ణారావు తెలిపారు. ఈ దాడిలో సారా తయారీకి ఉపయోగించే 300 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని చెప్పారు.

అసమానతలు రూపుమాపిన అంబేద్కర్

ప్రజాశక్తి-విశాఖపట్నం : అసమానతలు రూపుమాపిన అస్త్రం అంబేద్కర్ అంటూ విద్యార్థులు నినదించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో భాగంగా సోమవారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ప్రదర్శించిన లఘునాటికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంబేద్కర్ జీవితాన్ని, నాటి పరిస్థితులను వేదికపై విద్యార్థులు ఆవిష్కరించిన విధానం అనిర్వచనీయం. ఎటువంటి నాటక అనుభం లేకుండా, తొలిసారిగా వేదికపై ఏయూ కళాశాలల విద్యార్థుల ప్రదర్శన అందరి మనసులను ఆకట్టుకున్నాయి. ముందుగా ఏయూ ఐఎఎస్ఇ విద్యార్థులు విజన్ ఆఫ్ ఇంక్లూజన్ త్రూ ఎడ్యుకేషన్ నినాదంతో ప్రదర్శించిన రూపకం అంబేద్కర్ జీవితం, వివక్షత, అంటరానితనం, విద్యను ఆయుధంగా మలచుకుని అంబేద్కర్ ఎదిగిన విధానం వంటివి కళ్లకుకట్టినట్లు ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నారు.

ఏయూ ఫార్మశీ కళాశాల విద్యార్థులు మీరైతే ఏం చేస్తారు అంటూ ఆత్మన్యూనతను విడనాడాలని, అంబేద్కర్ రాజ్యాంగం, ఆశయాలను వివరిస్తూ సాగింది. ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు ఇండియా టుడే అంటూ ప్రదర్శించిన లఘు నాటిక హాస్యాన్ని, సందేశాన్ని సమపాళ్లలో అందిస్తూ నడిచింది. విద్యపై అంబేద్కర్ ఆలోచనలను వివరించింది. ఏయూ సైన్స్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ది విజన్ ఆఫ్ అంబేద్కర్ రూపకం మహిళా సాధికారత, గ్రామాలలో సామాజిక మార్పుల ఆవశ్యకతను తెలియజేసింది. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఐపిఎల్, ఆర్‌బిఐ అండ్ అంబేద్కర్, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన మహద్ చెరువు కట్ట, న్యాయ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సామాజిక న్యాయముతో సమైఖ్యాభివృద్ధి లఘు నాటికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని ఉద్దేశించి అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ, ఏయూ క్యాంపస్ విద్యార్థులు తక్కువ సమయంలో నేర్చుకుని ఈ నాటికలు ప్రదర్శించడం జరుగుతోందన్నారు. మనమంతా ఒక్కటే అనే సందేశం చాటుతూ సాగే ఈ ప్రదర్శనను అందరూ ప్రోత్సహించాలనిన్నారు.కార్యక్రమంలో ఓఎస్‌డి ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్‌లు, ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు శిక్షణ అందించిన నంది అవార్డు గ్రహీత మహేంద్ర చక్రవర్తిని అభినందించి, సత్కరించారు.

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపిని గద్దె దించాల్సిందే

- ఇండియా ఫోరంతోనే రాజ్యాంగ రక్షణ
- సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

మాట్లాడుతున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : భారతదేశ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపిని గద్దె దించాల్సిందేనని, అలాగే ఆ పార్టీకి వత్తాసు పలుకుతున్న తెలుగుదేశం, జనసేన పార్టీలతోపాటు అధికార వైసిపిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. స్థానిక నాయుళ్ల వీధిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని ప్రారంభించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఐఆర్.గంగాధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లోకనాథం మాట్లాడారు. రూ.50 వేల కోట్ల ఫోర్జరీ కేసులో బ్యాంకులను లూటీ చేసిన కూటమి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్‌ను ఓడించాలన్నారు. అనకాపల్లి ప్రజలకు మాట్లాడడం రాదని చెప్పిన రమేష్‌ను అనకాపల్లి ప్రజలు ఏ విధంగా గెలిపిస్తారన్నారు. జీఎస్‌టి కట్టాలని చెప్పిన అధికారులపై రౌడీయిజం చలాయించి అనకాపల్లి ప్రశాంతతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న రమేష్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. జిల్లాలో నాలుగు చెక్కర కర్మాగారాలపైనా, విశాఖ స్టీల్‌ప్లాంట్‌పైనా ఎందుకు ఈ నాయకులు మాట్లాడలేదన్నారు. ఎపికి రాజధాని లేకపోవడంలో టిడిపి, బిజెపి జనసేన, వైసిపి పాత్ర లేదా ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు చౌహాన్ మాట్లాడుతూ మోడీ తిరిగి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామనడం దారుణమన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు ఏడాదికి లక్ష రూపాయలు, కేజీ టు పీజీ ఉచిత విద్య, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, రైతు రుణమాఫీ, రైతుల పంటలకు కనీస మద్దతు ధర, ఉపాధి హామీ కూలీల కూలి రేట్లు పెంపు, ఏడాదికి 30 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు. సమావేశంలో అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి వేగి వెంకటేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పిఎస్.అజయ్ కుమార్, నర్సీపట్నం అసెంబ్లీ అభ్యర్థి రుత్తల శ్రీరామ్మూర్తి, పాయకరావుపేట అభ్యర్థి డాక్టర్ బోని తాతారావు తదితరులు పాల్గొన్నారు.

రెల్లి సామాజిక తరగతికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: రాష్ట్రంలో రెల్లి సామాజిక వర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని రెల్లి పొలిటికల్ జెఏసీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు డిమాండ్ చేశారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రాష్ట్ర వ్యాప్తంగా రెల్లిలకు రెండుఎమ్మెల్సీ పదవులివ్వాలని కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసనలో మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి డబ్బై ఏడేళ్లు గడిచినా రెల్లి సామాజిక వర్గానికి బానిసత్వం నుంచి విముక్తి కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు తమను ఓటు బ్యాంకుగానే వాడుకోవడం దురదష్టకరమన్నారు. రెల్లి సంఘం రాష్ట్ర ప్రతినిధి ఎస్. మోహన్‌కుమార్, జిల్లాప్రతినిధి కస్తూరి వెంకటరావు, మామిడి కనకారావు, జయరావు,ఉమా శంకర్, సిహెచ్ మహేష్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

బుజ్జగింపులు

- పెందుర్తి, మాడుగుల అభ్యర్థులను మార్చే ప్రసక్తిలేదన్న బాబు
- బండారు సత్యనారాయణ, గవిరెడ్డి రామానాయుడులపై ఆగ్రహం
- పార్టీ పదవులతో కొందరిని సంతృప్తిపరిచే యత్నం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో టికెట్‌రాని ఆశావహులను బుజ్జగించే చర్యలను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. కూటమి పొత్తుతో టికెట్‌రాక అసంతృప్తితోవున్న నాయకులను సంతృప్తిపర్చే పని ఆరంభించారు. కొంతమందికి పార్టీ బాధ్యతలు అప్పగించారు. మరికొందరిపై కలిసి పనిచేయక తప్పదని అసహనం ప్రదర్శించారు. ఆదివారం పాయకరావుపేట, గాజువాకల్లో ప్రజాగళం ముగించుకొని వెళ్తూ విమానాశ్రయంలో కొద్దిసేపు టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడులతో విడివిడిగా మాట్లాడారు. తమకు టికెట్ ఇచ్చే విషయం పరిశీలించాలని చంద్రబాబును బండారు, గవిరెడ్డి కోరినప్పుడు, ఇప్పుడున్న పరిస్థితుల్లో చేర్పులు, మార్పులు సాధ్యంకావని, కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. అధికారంలోకి వస్తే తగిన గౌరవం, గుర్తింపు ఇస్తామని చెప్పి, పంపించే ప్రయత్నం చేశారు. వారిద్దరూ అందుకు అంగీకరించకపోవడంతో ఒకదశలో వారిపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది.

పార్టీతో తన అనుబంధం, అధికారంలో లేని కాలంలో పార్టీ కోసం పనిచేసినప్పుడు పడ్డ ఇబ్బందులను ఆయన దృష్టికి బండారు తీసుకెళ్లినా కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. టిడిపి బలంగావున్న పెందుర్తి స్థానాన్ని జనసేనకు కేటాయించి, వైసిపి నుంచి వచ్చిన పంచకర్ల రమేష్‌బాబుకు టికెట్ ఇవ్వడంతో సీనియర్ నాయకుడైన తనకు అన్యాయం చేశారని బండారు తన ఆవేదనను వ్యక్తంచేశారు. కూటమి అభ్యర్థుల కోసం పనిచేయడం తప్ప మరో మార్గంలేదని, అసంతృప్తి మంచిదికాదని, పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేయాలని చంద్రబాబు పరుషంగా చెప్పినట్లు విశ్వనీయ సమాచారం. ఎంత చెప్పినా, చంద్రబాబు వినే పరిస్థితుల్లో లేకపోవడంతో బండారు కోపంగా బయటకు వచ్చినట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు.

మాడుగుల నియోజకవర్గంలో తనకున్న పట్టును మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు వివరించినా, ఇప్పుడు మార్పులు సాధ్యంకాదని, ఈసారికి కలిసి పనిచేయాలని చంద్రబాబు సూచించినట్లు తెలిసింది. టిడిపి అభ్యర్థి పైలా ప్రసాదరావును మార్చి తనకు టికెట్ ఇవ్వాలని, వాస్తవ పరిస్థితులు తనకు అనుకూలంగా వున్నాయని గవిరెడ్డి చెప్పినట్లు సమాచారం. 'నా మాట వినకపోతే, మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి' అని బాబు ఆగ్రహం వ్యక్తంచేయడంతో గవిరెడ్డి వెనుదిరిగినట్లు తెలిసింది. తమకు జరిగిన అన్యాయం, అవమానంపై బండారు, గవిరెడ్డి ఏకరువు పెట్టినా, అవేమీ ఆయన పట్టించుకోలేదు. దీంతో అసంతృప్తితో వారిద్దరూ బయటకు వచ్చినట్లు పార్టీ గ్రూపుల ద్వారా తెలిసింది.



ఇదే సమయంలో టికెట్‌రాని ఆశావహులు కొంతమందిని బుజ్జగించేందుకు పార్టీ బాధ్యతలు చంద్రబాబు అప్పగించారు. టిడిపిలో చేరిన దాడి వీరభద్రరావు చురుగ్గా పనిచేయడంలేదని గుర్తించి, ఆయనను ఎన్నికల సంఘం, పత్రిక సమావేశాల కేంద్ర కార్యాలయ సమన్వయకర్తగా, ఆయన తనయుడు రత్నాకర్‌ను, టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావును కార్యనిర్వాహక కార్యదర్శులుగా, బత్తుల తాతయ్యబాబును అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షునిగా, బోళెం ముత్యాలపాపను రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. టికెట్‌రాలేదని బాధతోవున్న బండారు, గవిరెడ్డికి పార్టీ బాధ్యతలు అప్పగించకపోవడం వారిని మరింత అవమానపర్చినట్లయింది.

ముగిసిన ఈస్ట్‌కోస్ట్ రైల్వే వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వాల్తేర్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన మొదటి వాల్తేరు రైల్వే డివిజన్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో, వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ముగిసాయి. ఈ పోటీలలో సివిల్ ఇంజినీరింగ్ మహిళల జట్టు, క్యారేజ్ అండ్ వ్యాగన్ పురుషుల జట్టు టైటిల్‌ను కైవసం చేసుకున్నాయి. మహిళల విభాగంలో 45 కేజీల విభాగంలో ఎస్ లక్ష్మి, 49 కేజీల విభాగంలో పి నాగమణి, 55 కేజీల విభాగంలో పుణ్యవతి, 59 కేజీల విభాగంలో కె నీలవేణి, 64 కేజీల విభాగంలో కె. శారద, 71 కేజీల విభాగంలో సునీత నాయక్, 76 కేజీల విభాగంలో జి పద్మావతి, 81 కేజీల విభాగంలో పి ఉష, 87 కేజీల విభాగంలో ఎస్ పద్మ, 87 కేజీల విభాగంలో ఎం.జయ శివవర్ధిని స్వర్ణ పతకాలు సాధించారు .పురుషుల 55 కేజీల విభాగంలో సిహెచ్.ఉపేంద్ర, 61 కేజీలలో కేయూఎం రావు, 67 కేజీల విభాగంలో వైఎన్ మూర్తి, 73 కేజీల విభాగంలో జి అప్పన్న, 81 కేజీల విభాగంలో పి సంతోష్ కుమార్, 89 కేజీల విభాగంలో కేవీ రమణాచారి, 96 కేజీల విభాగంలో జె రాజ్‌కుమార్, 102 కేజీల విభాగంలో పి శ్రీను, 109 కేజీల విభాగంలో ఆర్ శ్రీనివాస్, 109 కేజీల విభాగంలో ఎం ప్రదీప్ స్వర్ణ పతకాలు సాధించారు.

న్యూ డెమోక్రసీ ఎమ్మెల్యే అభ్యర్థిగా లచ్చిరెడ్డి

పల్లాల లచ్చిరెడ్డి

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం నియోజకవర్గం సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పల్లాల లచ్చిరెడ్డి పేరును ఆ పార్టీ ఖరారు చేసింది. రంపచోడవరం మండలం, బూచిగూడెం పంచాయతీ పరిధి కొత్తబాగల గ్రామానికి చెందినవారు లచ్చిరెడ్డి 1990 నుండి 97 వరకు స్పెషల్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్, రెవెన్యూ డిపార్ట్మెంట్లలో పనిచేశారు. 2005లో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ తరపున బోసి గూడెం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2013 నుండి ఆయన సతీమణి పల్లాల ఆదిలక్ష్మి సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం లచ్చిరెడ్డి పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సభ్యునిగా, రంపచోడవరం డివిజన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఎన్నికల విధులు నిర్వర్తించాల్సిందే

- అధికారులకు డిఆర్ఓ కె.మోహన్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయి ఆర్డర్లు తీసుకున్న వారంతా ఎన్నికల విధులకు తప్పకుండా హాజరుకావాల్సిందేనని, ఎవరికీ మినహాయింపులు లేవని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ తెలిపారు. తొలి విడత శిక్షణకు హాజరుకాని వారు తగిన కారణాలు తెలిపాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఒపిఒలుగా విధులు కేటాయించిన వారంతా మంగళవారం సాయంత్రం నాటికి ఫారం 12 పత్రాలు సమర్పించాలని సూచించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం పోలింగ్ పర్సనల్ నోడల్ అధికారి రవీంద్ర, ఎన్ఐసి విభాగ అధికారులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం కావాల్సిన వారంతా విధిగా వారికి కేటాయించిన విధులకు హాజరు కావాలని, మినహాయింపులు కోరరాదని హితవు పలికారు. అందుబాటులో ఉన్న సిబ్బందిని అవసరాలను దృష్టిలో ఉంచుకొని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామని స్పష్టం చేశారు. వారిలో ఇంకెవరికీ మినహాయింపులు ఉండబోవని తేల్చిచెప్పారు. ఇప్పటికే ఆర్డర్లు తీసుకున్న వారు ఇంకా 1086 మంది ఎక్నాలెడ్జెమెంట్‌లు సమర్పించాలన్నారు. ఒపివోలుగా విధులు కేటాయించిన అధికారులు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి అనుగుణంగా ఫారం-12 పత్రాలు సమర్పించాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులంతా సహకరించాలని డిఆర్ఓ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. పోలింగ్ పర్సనల్ నోడల్ అధికారి రవీంద్ర, ఎన్ఐసి అధికారులు పలు అంశాలపై మాట్లాడారు. సమావేశంలో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యలో కాషాయీకరణ వద్దు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కాషాయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా సేవ్ కమిటి రాష్ట్ర సలహాదారులు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఎస్. గోవింద రాజు డిమాండ్ చేశారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటి రూపొందించిన ప్రజా ప్రత్యామ్నాయ విధానం మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానం 2020 నుంచి దేశంలోనూ, రాష్ట్రంలోనూ అమలవుతోందన్నారు. ఓట్ల రాజకీయాలు చేస్తున్న రాజకీయ పార్టీలన్నీ విద్య ఊసెత్తక పోవడం శోచనీయమన్నారు.

కేంద్ర బడ్జెట్లో 10 శాతం నిధులను విద్యకు గ్యారంటీ చేయాలన్నారు. జ్ఞానంతో పరిపూర్ణమైన మనిషిని రూపొంచే ప్రక్రియగా, సామాజిక బాధ్యత, స్పృహ కలిగిన పౌరునిగా మలిచే సాధనంగా విద్యా లక్ష్యాన్ని నిర్వచించాలని కోరారు. భారతీయ జ్ఞాన వ్యవస్థలు (ఐకెఎస్) అనే పేరుతో బోధిస్తున్న ప్రగతి నిరోధక అశాస్త్రీయ భావాలను పాఠ్యాంశాల నుండి తొలగించి, శాస్త్రీయ, ప్రజాస్వామ్య, సెక్యులర్ విలువల ప్రాతిపదికగా పాఠ్యప్రణాళికలను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కొలవెన్ను,అడ్వకేట్ జహ అరా, ఉపాధ్యాయ నాయకులు ధర్మేందర్ రెడ్డి, డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్, రిటైర్డ్ టీచర్ సత్యవతి, విద్యార్థి నాయకులు కె. అభిలాష్ పాల్గొన్నారు.